సాక్షి కామారెడ్డి

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



రైతుల సంక్షేమమే ధ్యేయం

రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు.

- 8లో ▸



అంగన్‌వాడీల భిక్షాటన

డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టిన అంగన్‌వాడీ ఉద్యోగులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 35.4 /22.8

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

రేపు ఎమ్మెల్సీ కవిత రాక



నిజాంసాగర్: ఎమ్మెల్సీ కవిత ఆదివారం మహమ్మద్‌నగర్‌కు రానున్నారు. మహమ్మద్ నగర్ మండలంతోపాటు తహసీల్ కార్యాలయాన్ని ప్రారంభించడానికి ఎమ్మెల్సీ కవిత వస్తున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. ఈ నేపథ్యంలో బూర్గుల్ గ్రామ గేటు వద్ద సభ నిర్వహించనున్నామన్నారు. శుక్రవారం సభా స్థలాన్ని బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ కవిత 133 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే హన్మంత్ సింధే, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని ప్రజలను కోరారు. సభా స్థలిని పరిశీలించినవారిలో గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, ముగ్దుంపూర్ సర్పంచ్ లక్ష్మీనారాయణ నాయకులు కాశయ్య, రామాగౌడ్, మహేందర్, గౌస్ ఉన్నారు.

కేటీఆర్ సభ ఏర్పాట్ల పరిశీలన




బాన్సువాడ: పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ బాన్సువాడ పర్యటన నేపథ్యంలో డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. మంత్రి కేటీఆర్ వచ్చేనెల 4న బాన్సువాడలో పర్యటించి మల్టీ జనరేషన్ పార్కు, చిల్డ్రన్స్ పార్కు, మున్సిపల్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయ భవనాలను ప్రారంభించనున్నారు. అనంతరం వీక్లీ మార్కెట్‌లో నిర్వహించే బహిరంగ సభలో మాట్లాడతారు. ఈ నేపథ్యంలో ఎస్పీతో కలిసి డీసీసీబీ చైర్మన్ సభాస్థలితోపాటు పార్కింగ్ స్థలం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, పాత బాలకృష్ణ, జుబేర్ తదితరులున్నారు.

జిల్లా రేషన్ డీలర్ల సంఘం కార్యవర్గం ఎన్నిక

కామారెడ్డి రూరల్: జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లద్దూరి లక్ష్మీపతి యాదవ్ (దేవునిపల్లి), కార్యదర్శిగా పరిగి జనార్దన్‌రెడ్డి, కోశాధికారిగా అన్నం ప్రభాకర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా మన్నె మల్లారెడ్డి, న్యాయ సలహాదారులుగా గరీబున్నీసా నయీం(లింగంపేట్), అశోక్ జైన్ (కామారెడ్డి), ఉపాధ్యక్షులుగా అశోక్ (పిట్లం), శ్రీనివాస్‌రెడ్డి (పెద్ద కొడప్‌గల్), హేమ్‌సింగ్ రాథోడ్ (గాంధారి), రామచంద్రం (బిచ్కుంద), లక్ష్మీరాజ్యం (మాచారెడ్డి), ఖయ్యూం నిషాత్ (బాన్సువాడ), సిద్దగౌడ్ (బీబీపేట), నరసింహులు (బీర్కూర్), పవన్ (మద్నూర్), విజయ్ (ఎల్లారెడ్డి), సంయుక్త కార్యదర్శులుగా కిరణ్ (నాగిరెడ్డిపేట్), పోచయ్య (దోమకొండ), సుభాష్ (జుక్కల్), బాలరాజురెడ్డి (రాజంపేట), రియాజుద్దీన్ (సదాశివనగర్), చంద్రం (భిక్కనూరు), దశరథ్ నాయక్ (నస్రుల్లాబాద్), రమేష్ (తాడ్వాయి) ఎన్నికయ్యారు. ఏడుగురు కార్యనిర్వాహక సభ్యులను, తొమ్మిది మంది సలహాదారులను, ముగ్గురిని మీడియా ఇన్‌చార్జీలుగా ఎన్నుకున్నారు.

'డ్రగ్స్‌పై అవగాహన కల్పించాలి'



కామారెడ్డి క్రైం: డ్రగ్స్‌పై 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జాతీయ బాలల హక్కుల కమిషన్ చైర్మన్ ప్రియాంక్ కానుంగో సూచించారు. శుక్రవారం ఆయన బాలల పరిరక్షణకు సంబంధించి తీసుకోవలసిన చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ జిల్లాల అధికారులతో మాట్లాడారు. మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీసీలో జిల్లా నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఐసీడీఎస్ పీడీ బావయ్య, డీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం పోరుబాట!



హక్కుల సాధన కోసం సంఘాలు ఉద్యమ బాట పడుతున్నాయి. ప్రధానంగా సీఎం కేసీఆర్ పోటీ చేసే కామారెడ్డి నియోజకవర్గంపై ఫోకస్ చేశాయి. ఇప్పటికే రాజకీయ ప్రాధాన్యత కోసం ముదిరాజ్‌లు ధర్మయుద్ధం పేరుతో జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ తీయగా.. ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలంటూ లబాన్ లంబాడీలు ఆందోళనకు సిద్ధమయ్యారు. రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటూ రెడ్డి సంఘాలు, గోదావరి జలాల కోసం జల సాధన సమితి, గల్ఫ్ కార్మికులను ఆదుకోవాలంటూ గల్ఫ్ బాధితులు పోరాటానికి సన్నద్ధమవుతున్నారు.

- ఇప్పటికే ముదిరాజ్‌ల 'ధర్మయుద్ధం'
- నేడు లబాన్ లంబాడాల ఆందోళన
- రేపు జలసాధన సమితి రౌండ్ టేబుల్ సమావేశం
- పాదయాత్రకు రెడ్డి సంఘాల సన్నాహాలు
- ఎన్నికల బరిలో దిగుతామంటున్న గల్ఫ్ బాధితులు
- కామారెడ్డిలో వేడెక్కుతున్న రాజకీయాలు

సాక్షి, కామారెడ్డి: ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్న నేపథ్యంలో అందరి దృష్టి ఈ ప్రాంతంపైనే కేంద్రీకృతమైంది. రాజకీయ పార్టీలతో పాటు కుల సంఘాలు, ప్రజా సంఘాలు కూడా కామారెడ్డిని వేదికగా చేసుకుని ఉద్యమాలకు రెడీ అయ్యాయి. ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో తమ డిమాండ్లను సాధించుకునేందుకు ఆయా సంఘాలు రంగంలోకి దిగడంతో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తూ కార్యక్రమాలు చేపడుతుండడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. మూడోసారి అధికారంలోకి రావడానికి బీఆర్ఎస్ ప్రజాకర్షక పథకాలు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్న సమయంలో కుల సంఘాల ఆందోళనలు కొంత ఇబ్బందికరంగా మారుతున్నాయి. సీఎం కేసీఆర్ పోటీ చేయనున్న కామారెడ్డి నియోజకవర్గంలోనే ఆందోళనలు జరుగుతుండడంతో సర్వత్రా చర్చ జరుగుతోంది.

'మేమెంతో.. మాకంత' అంటున్న ముదిరాజ్‌లు..

'మేమెంతో మాకంత' అన్న నినాదంతో ముదిరాజ్ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాకేంద్రంలో భారీ ర్యాలీ, సభ నిర్వహించారు. జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ర్యాలీకి వేలాదిగా తరలివచ్చిన ముదిరాజ్ కులస్తులు.. అధికార బీఆర్ఎస్ తమ కులానికి ఒక్క సీటు కూడా కేటాయించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ కులానికి ప్రాధాన్యత ఇవ్వని పార్టీలకు ఓట్లతో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

రెడ్డి కార్పొరేషన్ కోసం..

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటూ రెడ్డి సంఘాలు ఉద్యమిస్తున్నాయి. గజ్వేల్ నుంచి కామారెడ్డి వరకు పాదయాత్ర చేయాలని నిర్ణయించాయి. ఈ పాదయాత్ర అక్టోబర్ 29న గజ్వేల్‌లో ప్రారంభమై నవంబర్ 5న కామారెడ్డికి చేరుకుంటుంది. అనంతరం కామారెడ్డిలో బహిరంగ సభ నిర్వహిస్తారు.

గల్ఫ్ బాధితుల సంక్షేమం కోసం..

గల్ఫ్ కార్మికులను ఆదుకుంటామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నెరవేర్చలేదని ఆరోపిస్తున్న గల్ఫ్ కార్మిక సంఘాలు.. సర్కారుపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో కామారెడ్డి నియోజకవర్గం నుంచి వంద మంది మహిళలతో నామినేషన్లు వేయించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాయి. గల్ఫ్ దేశాలలో వివిధ కారణాలతో ఎంతోమంది చనిపోతున్నారని, వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తున్నారు. గల్ఫ్ కార్మికుల కోసం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

గోదావరి జలాల సాధనే లక్ష్యంగా..

కామారెడ్డి ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు తీరాలంటే గోదావరి జలాలను మళ్లించడమే పరిష్కారమని జల సాధన సమితి ప్రతినిధులు భావిస్తున్నారు. 2005 నుంచి గోదావరి జలాల సాధన కోసం ఈ ప్రాంత రైతాంగం ఎన్నో ఉద్యమాలు చేస్తున్నారు. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి గోదావరి జలాలను కామారెడ్డి ప్రాంతానికి అందిస్తామని హామీ ఇచ్చి నిధులు మంజూరు చేయడంతో పాటు పనులు ప్రారంభించారు. అయితే ఆయన అకాల మరణం పొందడంతో కల నెరవేరలేదు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు గడచినా కామారెడ్డి ప్రాంతానికి గోదావరి నీళ్లు రాలేదు. పాలకుల పక్షపాత ధోరణి వల్లే కామారెడ్డి ప్రాంతానికి నీరందడం లేదని జల సాధన సమితి ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. మల్లన్నసాగర్‌కు నీళ్లు అందించిన సర్కారు.. కాళేశ్వరం 22వ ప్యాకేజీకి నిధులు కేటాయించకపోవడానికి పాలకుల పక్షపాత వైఖరికి ఉదాహరణగా చూపుతున్నారు. ఈనెల 17న 22వ ప్యాకేజీ పనులను పరిశీలించిన జలసాధన సమితి ప్రతినిధులు.. ఉద్యమానికి కార్యాచరణ రూపొందించారు. కాళేశ్వరం 22వ ప్యాకేజీ పనులను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ఆదివారం జిల్లా కేంద్రంలోని కర్షక్ బీఈడీ కాలేజీలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశం అనంతరం భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించే అవకాశాలున్నాయి.

ఎస్టీలలో చేర్చాలంటున్న లబాన్ లంబాడీలు

దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని రిజర్వేషన్ సమస్యపై లబాన్ లంబాడాలు(కాయితీ) పోరుబాట పట్టారు. ఇటీవల కలెక్టరేట్‌ను ముట్టడించారు. గాంధారి మండల కేంద్రంలో భారీ సమావేశం నిర్వహించారు. శనివారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఎస్టీ జాబితాలో లేకపోవడంతో తాము ఎంతో నష్టపోయామని వారు ఆవేదనతో ఉన్నారు. ముఖ్యంగా పోడు భూములు సాగు చేసుకుంటున్న లబానా లంబాడీలు బీసీ జాబితాలో ఉండడంతో వారికి పట్టాలు దక్కలేదు. ఎస్టీ జాబితాలో చేర్చితేనే తమకు ఫలాలు దక్కుతాయని వారు పేర్కొంటున్నారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే కామారెడ్డి నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో నామినేషన్లు వేస్తామని హెచ్చరిస్తున్నారు. సమస్య పరిష్కారం కానిపక్షంలో ఎన్నికల్లో తమ తడాఖా చూపుతామంటున్నారు.

'జిల్లా సమగ్ర స్వరూపం' చదివించాలి



జిల్లా సమగ్ర స్వరూపం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: తెలంగాణ సారస్వత పరిషత్ ప్రచురించిన కామారెడ్డి జిల్లా సమగ్ర స్వరూపం పుస్తకాన్ని విద్యార్థులతో చదివించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు వి శంకర్ కన్వీనర్‌గా ఉన్న కోర్ కమిటీ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా సమగ్ర స్వరూపం గ్రంథాన్ని రూపొందించారు. 40 మంది రచయితలు రాసిన 46 వ్యాసాలు కలిగిన ఈ పుస్తకాన్ని శుక్రవారం కలెక్టర్ తన చాంబర్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, పర్యాటక స్థలాలు, సామాజిక, రాజకీయ రంగాలు, శాసనాలు, విద్యాసంస్థలు, వనరులు, ఆర్థిక స్థితిగతులు, జానపద ఆధ్యాత్మిక కళారంగాలు తదితర అంశాలపై ఇందులో వ్యాసాలు ఉన్నాయన్నారు. ఈ పుస్తకం విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉంచడానికి 600 ప్రతులను సారస్వత పరిషత్ నుంచి తెప్పించామన్నారు. వాటిని కామారెడ్డి జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, గ్రంథాలయ శాఖలలో అందుబాటులో ఉంచాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డీఈవో రాజు, ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాంలకు పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, అధికారులు పాల్గొన్నారు.

'ర్యాలీలు, సభలకు అనుమతి తప్పనిసరి'

కామారెడ్డి క్రైం: జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున పోలీసుల అనుమతి లేనిదే ఎలాంటి ర్యాలీలు, సభలు, ధర్నాలు నిర్వహించరాదని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే ముందుగా సంబంధిత ఏరియా డీఎస్పీ కార్యాలయం నుంచి అనుమతి తీసుకోవాలని సూచించారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖకు సహకరించాలని కోరారు.

రేషన్ లబ్ధిదారులకు ఈ -కేవైసీ కష్టాలు

- వేలిముద్రలు పడక తిప్పలు
- అప్‌డేట్ కోసం ఆధార్ సెంటర్లకు పరుగులు
- వలస వెళ్లిన వారి కుటుంబాల్లో ఆందోళన
- ప్రత్యామ్నాయం చూపాలంటున్న ప్రజలు



కామారెడ్డి రూరల్: ఆహార భద్రతకార్డుల ఈ-కేవైసీ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రేషన్ కార్డులో పేరున్న ప్రతి ఒక్కరు ఈ-కేవైసీ చేయించుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ సూచించింది. ఇందుకోసం రేషన్ దుకాణాల్లోని బయోమెట్రిక్ యంత్రంపై వేలిముద్ర వేసి ధ్రువీకరణ పూర్తి చేయించుకోవాల్సి ఉంటుంది. రాష్ట్రంలో ఏ ప్రాంతంలోని రేషన్ షాపునుంచైనా ఈ-కేవైసీ చేయించుకోవడానికి అవకాశం కల్పించింది. అయితే విదేశాల్లో ఉన్నవారు మాత్రం మన రాష్ట్రానికి వచ్చి ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంటుంది.

వృద్ధులు, పిల్లల ఇబ్బందులు..

ఈ-కేవైసీ అప్‌డేట్‌లో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా 60 ఏళ్లపై బడిన వారి ఫింగర్ ప్రింట్స్ రావడం లేదు. మరి కొందరు వృద్ధులు అనారోగ్యంతో ఇంటికే పరిమితమయ్యారు. వీరు ఈ-కేవైసీ చేయించుకోవడానికి రేషన్ దుకాణాలకు వెళ్లే పరిస్థితులు లేవు. చిన్నారుల వేలిముద్రలూ రావడం లేదు. దీంతో వృద్ధులు, చిన్నారుల ఆధార్ అప్‌డేట్ చేయించడానికి ఆధార్ సెంటర్లకు వెళ్తున్నారు. మరోవైపు అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన వారి పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వారికి ప్రత్యామ్నాయాలు చూపాలని కోరుతున్నారు.

ఆధార్‌కార్డు అప్‌డేట్ తప్పనిసరి..

వేలిముద్రలు, ఐరిస్ రాకపోతే ఆహారభద్రతకార్డుదారులు తమ ఆధార్‌కార్డు అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం ఆధార్ సెంటర్‌కు వెళ్లాలి. కార్డు పొంది పదేళ్లు పూర్తయినవారు తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలని ఇప్పటికే సూచించారు. అప్‌డేట్ చేసుకోకపోతే రేషన్ దుకాణాల్లో ఈ కేవైసీ కాదని అధికారులు పేర్కొంటున్నారు.

విదేశాలకు వెళ్లిన వారి పరిస్థితి?

ఆహార భద్రత కార్డులో పేరున్న ప్రతి ఒక్కరికి ఈ-కేవైసీ తప్పనిసరి కావడంతో ఉపాధి కోసం విదేశాలకు ఇతర రాష్ట్రాలకు వెళ్లినవారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. జిల్లానుంచి వేలాది మంది ఉపాధి కోసం ఇతర ప్రాంతాలు, వేరే దేశాలకు వలస వెళ్లారు. ఇతర రాష్ట్రాలతో పాటు పలు దేశాలలో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్నవారు ఎంతోమంది ఉన్నారు. నెల రోజుల్లో వారంతా స్వగ్రామానికి తిరిగి వచ్చే పరిస్థితులు లేవు. ఈ-కేవైసీ చేయించలేదన్న కారణంతో వారి పేర్లు తొలగిస్తే ఆ సభ్యుల కోటా బియ్యం వస్తుందో లేదో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు.

"అక్టోబర్ 30 వరకు పూర్తి చేస్తాం



ఆహార భద్రత కార్డుదారుల ఈ-కేవైసీ ప్రక్రియను అక్టోబర్ 30 వరకు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బియ్యం పంపిణీ పూర్తయినందున రేషన్ డీలర్లు ఇదే పనిలో ఉన్నారు. వేలిముద్రలు రాని వారు ఐరిస్ ఇవ్వాలి. ఎవరూ ఆందోళన చెందవద్దు. అందరి వివరాలు తీసుకుంటాం. ఇతర రాష్ట్రాల్లో చదువుకుంటున్న, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు అక్కడ కూడా ఈ-కేవైసీ చేయించుకోవచ్చు. గల్ఫ్ దేశాలకు వెళ్లిన వారి వివరాల నమోదు విషయంలో పౌరసరఫరాల కమిషనర్ నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు.

– మల్లికార్జున్‌బాబు, డీఎస్‌వో, కామారెడ్డి

వారివి స్థాయికి మించిన మాటలు

- కేసీఆర్, కేటీఆర్‌ల మాటలతో తెలంగాణ సమాజం సిగ్గుపడుతోంది
- బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్



మాట్లాడుతున్న బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, పక్కన ఎంపీ అర్వింద్

సుభాష్‌నగర్(నిజామాబాద్): సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ స్థాయికి మించిన మాటలు మాట్లాడుతున్నారని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ విమర్శించారు. వారి మాటలు విని తెలంగాణ సమాజం సిగ్గుపడుతోందన్నారు. ఈనెల 3న నిజామాబాద్‌కు ప్రధాని మోదీ రానున్న నేపథ్యంలో శుక్రవారం ఆయన జిల్లాకేంద్రానికి వచ్చారు. స్థానిక గిరిరాజ్ కళాశాల మైదానంలోని సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ తెలంగాణ అభివృద్ధికి తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు తెలంగాణలో అభివృద్ధి పనుల కోసమే ప్రధాని వచ్చారని, రాజకీయాల కోసం రాలేదని పేర్కొన్నారు. తెలంగాణలో స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 2014 వరకు జాతీయ రహదారులు 2500 కిలోమీటర్లు మాత్రమే ఉండేవని, బీజేపీ అధికారంలోకి వచ్చాక తొమ్మిదేళ్లలో 3 వేల కిలోమీటర్ల నేషనల్ హైవేలను నిర్మించి ప్రధాని మోదీ చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. మేనిఫెస్టోలో లేకపోయినా, ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా రాష్ట్ర రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని రూ.6,300 కోట్లు వెచ్చించి మూతపడిన రామగుండం ఎరువుల ఫ్యాక్టరీని పునరుద్ధరించారన్నారు. ఎన్టీపీసీ ద్వారా 1600 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి తెలంగాణకు విద్యుత్ కొరత లేకుండా చేయాలని నిర్ణయించారని, ఇందులో భాగంగా 800 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును ఇందూరు నుంచి ప్రారంభించనున్నారని తెలిపారు. రెండు నెలల్లో మరో 800 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టును ప్రారంభిస్తారన్నారు. ఇంత చేస్తున్న ప్రధాని మోదీని ఏ ముఖం పెట్టుకుని రాష్ట్రానికి వస్తున్నావని మంత్రి కేటీఆర్ అనడం మూర్ఖత్వమన్నారు. జీపీ భవనాలు, మహిళా సమాఖ్య భవనాలు, మొక్కలు, శ్మశానవాటికలు ఇతరత్రా పనులన్నీ కేంద్రం నిధులతోనే సాగుతున్నాయన్నారు. సొమ్మొకరిది.. సోకొకరిది అన్నట్లుగా కేసీఆర్, కేటీఆర్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ గజకర్ణ, గోకర్ణ, టక్కుటమార విద్యతో ప్రజలను మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, రాబోయే రోజుల్లో ఆయన అహంకారం తగ్గేలా ప్రజలు కర్రు కాల్చి వాత పెడతారని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను బొందపెట్టి బీజేపీని ఆదరిస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సభ కోసం భారీ జన సమీకరణ చేయాలని బీజేపీ నేతలకు సూచించారు. మోదీ సభకు లక్షన్నర మందిని సమీకరిస్తామని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల జిల్లాల అధ్యక్షులు బస్వా లక్ష్మీనర్సయ్య, మోరేపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాగులో కొట్టుకుపోయిన పశువులు సురక్షితం



పశువులను పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సింహారావు

తాడ్వాయి: సంతాయిపేట్ శివారులోని భీమేశ్వర వాగులో కొట్టుకుపోయిన పశువులు శుక్రవారం వాగు నుంచి సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నాయి. గురువారం కురిసిన వర్షానికి భీమేశ్వర వాగు పొంగిప్రవహించడంతో సుమారు 200 పశువులు వాగులో కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. చెట్లు, రాళ్లలో ఇరుక్కుపోయిన పశువులు.. నీటి ఉధృతి తగ్గగానే ఒక్కొక్కటిగా బయటకు వచ్చాయి. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సింహారావు, డెయిరీ డీడీ శ్రీనివాస్ గ్రామానికి వచ్చి పశువులను పరిశీలించారు. ఈ సందర్భంగా సింహారావు మాట్లాడుతూ 162 పశువులకు చికిత్స అందించామన్నారు. 159 పశువులకు ఓ మోస్తరు గాయాలయ్యాయని, మూడు పశువుల పరిస్థితి సీరియస్‌గా ఉందని పేర్కొన్నారు. గ్రామంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశామని, మూడు రోజులపాటు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రాంచంద్రం, బీఎంసీ చైర్మన్ కృష్ణమూర్తి, సూపర్‌వైజర్ రమేశ్‌రెడ్డి, వీఎల్‌వో పోచయ్య, జీవీవో కొండల్‌రెడ్డి, గోపాలమిత్రలు బాలు, మహిపాల్‌రెడ్డి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లోకి 10వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

నిజాంసాగర్: ఎగువన కురుస్తున్న వర్షాలకు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం 10 వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు ఏఈ శివప్రసాద్ తెలిపారు. దీంతో ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 1,404.98 అడుగుల(17.773 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని తెలిపారు.

సింగూర్‌నుంచి నీటి విడుదల

సంగారెడ్డి జిల్లాలోని సింగూరు ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతుండడంతో శుక్రవారం ప్రాజెక్టు ఒక వరద గేటు ఎత్తి 8,194 క్యూసెక్కుల నీటిని మంజీర నదిలోకి వదులుతున్నారు. ఇన్‌ఫ్లో పెరుగుతున్నందున మరిన్ని గేట్లు ఎత్తే అవకాశం ఉందని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు. నది పరీవాహక ప్రాంతాల వైపు ఎవరూ వెళ్లవద్దని కోరారు.

క్లుప్తంగా

కుక్కల దాడి.. కృష్ణజింకకు తీవ్రగాయాలు

మద్నూర్(జుక్కల్): కుక్కల దాడిలో కృష్ణజింకకు తీవ్రగాయాలైన ఘటన డోంగ్లీ మండలంలోని సిర్పూర్ శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామ శివారులోని పొలాల్లో కృష్ణజింకపై కుక్కలు దాడి చేయడంతో స్థానికులు వాటిని చెదరగొట్టి పశువైద్యాధికారులకు సమాచారం అందించారు. కృష్ణజింకను కాపాడిన వారిని గ్రామస్తులు అభినందించారు.

ప్రజల సహకారం మరువలేనిది

- సీపీ సత్యనారాయణ



ఖలీల్‌వాడి: జిల్లాలో పండుగల నేపథ్యంలో జరిగిన గణేశ్ నిమజ్జనం, మిలాద్–ఉన్–నబీ వేడుకల్లో ప్రజల సహకారం మరువలేనిదని పోలీస్ కమిషనర్ సత్యనారాయణ పేర్కొన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని గణేశ్ నిమజ్జన శోభాయాత్ర, మిలాద్–ఉన్–నబీ వేడుకలు ప్రశాంతంగా ముగిశాయని వీటికి సహకరించిన అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ప్రజలకు సీపీ కృతజ్ఞతలు తెలిపారు.

నేడు జిల్లా జట్ల ఎంపిక

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో రూరల్ జోన్ స్కూల్ గేమ్స్ కబడ్డీ, ఖో–ఖో అండర్–14, అండర్–17 బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు శనివారం నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం సుశీల్ కుమార్, పీఈటీ మర్కంటి గంగామోహన్ శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు శనివారం ఉదయం 9.30 గంటల వరకు స్కూల్ బోనాఫైడ్‌తో హాజరు కావాలని సూచించారు. ఎంపిక చేసిన జట్లను అక్టోబర్ 3న బాల్కొండలో నిర్వహించే జిల్లా స్థాయి కబడ్డీ, ఖో–ఖో టోర్నమెంట్‌కు పంపిస్తామని తెలిపారు.

అర్చకులకు పునశ్చరణ తరగతులు

నిజామాబాద్ సిటీ: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ధూపదీప నైవేద్య అర్చకులకు అక్టోబర్ 1 నుంచి 3 తేదీ వరకు ఆలయాల్లో నిర్వహించే పూజలపై పునశ్చరణ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ శుక్రవారం తెలిపారు. శిక్షణ తరగతులు మాధవనగర్ సాయిబాబా ఆలయంలో ఉంటాయన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 595 అర్చకులకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించన్నుట్లు తెలిపారు. ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు రాచప్పా, అంజనప్పా ఉన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): వెల్లుట్లలో పోలింగ్ కేంద్రాన్ని ఎంపీవో ప్రకాష్ శుక్రవారం పరిశీలించారు. పంచాయతి కార్యదర్శి కృష్ణ తదితరులున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే జాజాల సురేందర్
- పలు గ్రామాల్లో గిడ్డంగులు ప్రారంభం



గండివేట్‌లో విండో భవనాన్ని ప్రారంభిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సురేందర్, డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి

గాంధారి(ఎల్లారెడ్డి): తెలంగాణాలో రైతుల శ్రేయస్సే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పాలన సాగిస్తున్నారని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. శుక్రవారం ఆయన గండివేట్, సీతాయపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ శంకర్ నాయక్, ఎంపీపీ రాధాబలరామ్ నాయక్, డీసీసీబీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్, ముదెల్లి విండోచైర్మన్ సాయిరాంతో కలిసి గండివేట్‌లో నూతనంగా నిర్మించిన విండో కార్యాలయ భవనాన్ని, సీతాయిపల్లి, ముదెల్లిలో నూతనంగా నిర్మించిన గిడ్డంగులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రైతులనుద్దేశించి మాట్లాడారు. పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేసి రైతులు ఆర్థికంగా ఎదగడానికి కృషిచేస్తున్నామన్నారు. సర్పంచ్‌లు సంజీవు, ఫారూఖ్, రాజమణి, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ పోడు భూముల పట్టాలివ్వాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): యాచారం, యాచారం తండాలలో అర్హులైన గిరిజనులకు పోడు భూముల పట్టాలను ఇవ్వాలని గిరిజన నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే జాజాల సురేందర్‌కు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. గిరిజన బీఆర్ఎస్ నాయకులు బల్‌రాం నాయక్, రమేశ్ నాయక్, మంగ్య నాయక్, సక్రు నాయక్, లాల్‌సింగ్, పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం

- జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే



నాగుల్‌గావ్‌లో రైతు వేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

నిజాంసాగర్(జుక్కల్): రైతును రాజు చేయడం సీఎం కేసీఆర్ లక్ష్యమని, రైతుల సంక్షేమానికి పెద్దపీట వేశారని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. శుక్రవారం జుక్కల్ మండలం నాగుల్‌గావ్‌లో నూతనంగా నిర్మించిన రైతు వేదికను ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతుల పంట ఉత్పత్తులకు మద్దతు ధర చెల్లిస్తూ, కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఇక్కడి పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఎంపీపీ యశోధ, సర్పంచ్ కపిల్ పటేల్, సొసైటీ చైర్మన్ శివానంద్ ఉన్నారు.

ఇళ్లు కోల్పోతున్న బాధితులను ఆదుకుంటాం

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోతున్న బాధితులను ఆదుకుంటామని ఎమ్మెల్యే హన్మంత్ సింధే అన్నారు. శుక్రవారం బాధితులతో మాట్లాడి డబుల్ బెడ్ రూం ఇళ్ల స్థలాల కోసం చదును చేస్తున్న భూమిని ఎమ్మెల్యే పరిశీలించారు. బాధితులకు స్థలం కేటాయించి అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. రోడ్డు వెడల్పు పనులపై అధికారులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎంపీటీసీ అశోక్ పటేల్, సీనియర్ నాయకులు నాల్చర్ రాజు, వెంకట్‌రావ్, బస్వరాజ్ పటేల్ పాల్గొన్నారు.

ప్రభుత్వం సోయా ఇండస్ట్రీని ఏర్పాటు చేయాలి

- ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ గోపాల్



మద్నూర్‌లో మాట్లాడుతున్న గోపాల్

మద్నూర్(జుక్కల్): స్థానికంగా రైతులు సోయాబీన్‌ను ప్రధాన పంటగా పండిస్తున్నారని, నాబార్డు అధికారులు, ప్రభుత్వం మద్నూర్‌లో సోయా ఇండస్ట్రీని ఏర్పాటు చేయాలని మద్నూర్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ చైర్మన్ చాట్లావార్ గోపాల్ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎంఎఫ్‌పీసీ డైరెక్టర్లు, రైతులతో రైతు ఉత్పత్తిదారుల సంఘం మొదటి మహాజన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సభలో పంట బీమాపై ప్రభుత్వం ఆదుకోవాలని వారు తీర్మానం చేశారు. రైతులు పంటలను అమ్ముకోవడానికి, కొనుగోళ్లు చేసేటప్పుడు మెరుగైన ధరల కోసం బేరసారాలు చేయడానికి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్‌రావ్, బోధన్ ఎఫ్‌పీవో డైరెక్టర్ అర్జున్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటనతో నిరసన తెలిపిన అంగన్‌వాడీలు

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కొన్నిరోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తల చేస్తున్న ఆందోళనలు శుక్రవారం కూడా కొనసాగాయి. సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని వారు కోరారు. కనీస వేతనం చెల్లించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



జిల్లా కేంద్రంలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు



రాజంపేటలో..



నస్రుల్లాబాద్‌లో ..



నిజాంసాగర్‌లో ..

జాతీయ స్థాయి జూడో పోటీలకు గురుకుల విద్యార్థిని



బేబీ లత

బాన్సువాడ రూరల్: రాజస్థాన్‌లో జరిగే సీనియర్ నేషనల్ జూడో ఛాంపియన్‌షిప్ 2023–24కు తమ విద్యాలయానికి చెందిన బేబీ లత ఎంపికైనట్లు కొయ్యగుట్టలోని ఎస్సీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శోభారాణి తెలిపారు. ప్రస్తుతం ఇంటర్ సెకండియర్ చదువుతున్న బేబీ లత ఇప్పటికే మణికొండలో శిక్షణ పూర్తి చేసుకుందన్నారు. అక్టోబర్ 1నుంచి 5 వరకు జరిగే పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తుండటం గర్వకారణమన్నారు. బేబి లతను శుక్రవారం పాఠశాలలో అభినందించి, రాజస్థాన్‌లో జరిగే పోటీలకు హాజరయ్యేందుకు వీడ్కోలు పలికారు.



జోనల్ టీంతో ఉపాధ్యాయ బృందం

జోనల్ టీం ఎంపికకు క్రీడా పోటీలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): బాన్సువాడ జోనల్ వాటీబాల్ టీం ఎంపిక పోటీలను శుక్రవారం నెమ్లి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమాన్ని హెచ్‌ఎం దుర్గాబాయి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, పీఈటీ సురేందర్, లాల్‌సింగ్, అనిల్, ప్రియాంక, తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ హైస్కూల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్ ఏర్పాటు



మాచారెడ్డి: పాల్వంచ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌ను శుక్రవారం ప్రారంభించారు. పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు రాజభైరయ్య ఆధ్వర్యంలో హెడ్మాస్టర్ గోవర్ధన్‌రెడ్డి పర్యవేక్షణలో దీనిని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు ఓటు విలువపై అవగాహన కల్పించారు. తొలి సమావేశంలో మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, సెక్టరియల్ ఆఫీసర్ శ్రీపతి పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా పంచాయతీ భవన నిర్మాణం

నేడు ప్రారంభించనున్న ప్రభుత్వ విప్



ఫరీదుపేట జీపీ భవనం

మాచారెడ్డి: ఆ భవనాన్ని చూడగానే వావ్ అనకుండా ఉండలేరు. అంత ఆకర్షణీయంగా ఉన్న ఆ నిర్మాణం ఎవరో బడాబాబుల ఇల్లు అనుకుంటే పొరబడినట్లే.. అది పంచాయతీ కార్యాలయ భవనం. పాల్వంచ మండలం ఫరీదుపేట గ్రామ పంచాయతీ పాత భవనం శిథిలావస్థకు చేరడంతో దాన్ని కూల్చివేసి, రూ.45 లక్షలతో కొత్త భవనాన్ని నిర్మించారు. ఆధునిక హంగులతో నిర్మించిన భవనం అందరినీ ఆకర్షిస్తోంది. ఇందులో సర్పంచ్, కార్యదర్శులకోసం ప్రత్యేక గదులతోపాటు సమావేశ మందిరం, విశ్రాంతి గది ఉన్నాయి. ఈ పంచాయతీ కార్యాలయ భవనాన్ని శనివారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ప్రారంభిస్తారని సర్పంచ్ ఆశం భాగ్యమ్మ తెలిపారు.

వంద శాతం పన్నుల వసూళ్లు పూర్తవ్వాలి

- ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్



జప్తిజాన్కంపల్లిలో ఇంటి పన్నులు వసూలు చేస్తున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామంలో వంద శాతం ఇంటి పన్నుల వసూళ్లు పూర్తవ్వాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. జప్తిజాన్కంపల్లి జీపీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించారు. సర్పంచ్ దేశబోయిన సాయిలు, కార్యదర్శి ప్రదీప్‌కుమార్ ఉన్నారు.

రాజంపేటలో..

రాజంపేట: మండల పంచాయతీ కార్యదర్శులు తమ జీపీ పరిధిలలో వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని స్థానిక ఎంపీడీవో బాలకిషన్ సూచించారు. శుక్రవారం మండల పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్నందున అన్ని పోలింగ్ స్టేషన్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

నర్సన్నపల్లిలో..

కామారెడ్డి రూరల్: గ్రామ పంచాయతీల్లో ఈ నెలాఖరు వరకు వందశాతం పన్నులు వసూలు చేయాలని గ్రామ కార్యదర్శులను ఎంపీవో మలహరి ఆదేశించారు. శుక్రవారం నర్సన్నపల్లిలో ఆయన పర్యటించారు. పలు సూచనలు ఇచ్చారు.

విద్యుత్ సిబ్బంది నిర్బంధం



బీబీపేట: ప్రభుత్వం వ్యవసాయానికి 12 గంటల కరెంటు కూడా అందించడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం ఉప్పర్‌పల్లిలో విద్యుత్ సిబ్బందిని గదిలో నిర్బంధించారు. ప్రభుత్వం 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని చెబుతోందని, 12 గంటలకన్నా ఎక్కువ ఎందుకు ఇవ్వడం లేదని విద్యుత్ సిబ్బందిని ప్రశ్నించారు. 24 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని కోరారు.

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



ఫిజియోథెరపి చేస్తున్న డాక్టర్ గంగాధర్

బాన్సువాడ రూరల్/పిట్లం/బిచ్కుంద : దివ్యాంగ విద్యార్థులకు ప్రతి రోజు ఫిజియోథెరపి చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయని ఫిజియోథెరపిస్టులు గంగాధర్, విశాలాక్షి అన్నారు. శుక్రవారం బాన్సువాడ, బిచ్కుంద, పిట్లం భవిత కేంద్రాల్లో వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు వేర్వేరుగా వారు ఫిజియోథెరపి చేశారు. దివ్యాంగ విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు చేదోడు వాదోడుగా ఉండాలన్నారు. వారి వైకల్యాన్ని అవహేళన చేయకుండా వారిని ఆదరించాలని ఫిజియోథెరపిస్టులు సూచించారు.

రూ. లక్ష పలికిన లడ్డూ



మద్నూర్(జుక్కల్): మొగాలోని సార్వజనిక్ గణేష్ మండలి వద్ద గణపతి చేతిలో ఉన్న లడ్డూ వేలం వేయగా గ్రామానికి చెందిన హాలే బస్వంత్ పటేల్ రూ.1,00,116 కి దక్కించుకున్నాడని ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. అలాగే అదే గ్రామంలో సిద్ధి వినాయక గణేష్ వద్ద రూ.42 వేలకు బర్గే హవ్‌గోండ, రాంగణేష్ వద్ద రూ.40 వేలకు బాల్‌రాజ్ గౌడ్, సంగమేశ్వర గణేష్ వద్ద రూ.31 వేలకు బీమ్ గోండ, భవాని గణేష్ వద్ద రూ.28 వేలకు రాజు, బాల గణేష్ వద్ద రూ.25 వేలకు బుల్లారే బస్వంత్, విఘ్నేశ్వర గణేష్ వద్ద రూ.10 వేలకు సుధాకర్‌గౌడ్‌లు లడ్డు వేలం పాటలో అత్యధికంగా పాడి సొంతం చేసుకున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఎడపల్లి–జానకంపేట మధ్య ఉన్న రైల్వే ట్రాక్‌పై రైలు ఢీకొని ఒకరు మృతిచెందినట్లు రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపారు. నగరంలోని గాయత్రీనగర్‌కు చెందిన సోలంకి కృష్ణ(19) బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి గంజాయి సేవించాడు. ఎడపల్లి–జానకంపేట మధ్య రైల్వేట్రాక్ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో పడి యువకుడు..

రుద్రూర్: చెరువులో చేపట్టేందుకు వెళ్లిన ఓ యువకుడు నీటిలో పడి మృతి చెందిన ఘటన చిక్కడపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిక్కడపల్లి క్యాంపునకు చెందిన గుడిసె రాజు(33) చేపలు పట్టేందుకు గ్రామ చెరువుకి శుక్రవారం వెళ్లాడు. చేపలు పడుతుండగా నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



రాజు మృతదేహం

దుబాయిలో అడ్లూర్‌వాసి..

కామారెడ్డి రూరల్: బతుకుదెరువు నిమిత్తం దుబా యి వెళ్లిన ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో గురువారం రాత్రి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ని అడ్లూర్ గ్రామానికి చెందిన కుమ్మరి రాజు (28), అతని తమ్ముడు రాకేశ్ బతుకుదెరువు నిమిత్తం రెండేళ్ల క్రితం దుబాయి వెళ్లారు. దసరా పండుగకు స్వ గ్రామానికి వద్దామనకున్న తరుణంలో రాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా వీరి తల్లీదండ్రులు పదేళ్ల క్రితం చనిపోయారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని స్వగ్రామానికి తెప్పించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాలువలో మృతదేహం లభ్యం

బోధన్‌రూరల్(బోధన్): సాలూర మండలం సాలంపాడ్ గ్రామ శివారులోని నిజాంసాగర్ కాలువలో ఓ మహిళ మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. రుద్రూర్ మండలంలోని రాయికూర్‌కు చెందిన గౌరవ్వ(42) మతిస్థిమితం సరిగా లేకపోవడంతో కుటుంబసభ్యులు దూరంగా ఉంటున్నారు. సాలంపాడ్‌లో ఉంటున్న తన అన్న ఇంటికి ఈ నెల 25న రాగా తిరిగి ఇంటికి చేరుకోలేదు. నిజాంసాగర్ కెనాల్‌లో మహిళ మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టగా గౌరవ్వ మృతదేహంగా గుర్తించారు. మృతురాలి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గాంధారి(ఎల్లారెడ్డి): రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. సిద్దిపేటకు చెందిన రంగయ్య మండలంలోని చద్మల్‌లో ఉంటున్న తన అత్తగారింటికి వచ్చి బైక్‌పై వెళ్తుండగా రహదారిపై మరో బైక్ ఢీకొన్నది. ఈ ఘటనలో కిందపడ్డ రంగయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. కామారెడ్డి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై ప్రేమ్‌చంద్ తెలిపారు.

జంగంపల్లిలో వాల్‌పోస్టర్ కలకలం



భిక్కనూరు: గుర్తు తెలియని వ్యక్తులు అతికించిన వాల్‌పోస్టర్‌తో మండలంలోని జంగంపల్లిలో కలకలం రేపింది. రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ జనార్దన్‌రెడ్డి జీపీలో కనిపిస్తే కాల్చివేస్తామంటూ వాల్‌పోస్టర్ వెలువడింది. ఈ విషయమై జనార్దన్‌రెడ్డిని సంప్రదించగా తనకు శత్రువులు ఎవరూ లేరని, తాను ఆధ్యాత్మిక చింతనలో ఉన్నానని తెలిపారు.

భూవివాదంలో ఒకరి మృతి

- మృతదేహంతో నిందితుడి ఇంటి ఎదుట నిరసన
- కేశాపూర్‌లో ఉద్రిక్త పరిస్థితి



సత్యంరెడ్డి (ఫైల్)

నిజామాబాద్ రూరల్: భూమి కోసం జరిగిన గొడవల్లో ఓ నిండు ప్రాణం బలైన ఘటన మండలంలోని కేశాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉమ్మాయి సత్యంరెడ్డి(52), అదే గ్రామానికి చెందిన విఠల్‌రెడ్డిలు అన్నదమ్ముల కుమారులు. వీరికి పక్కపక్కనే వ్యవసాయ భూములు ఉండడంతో ఆరేళ్లుగా ఇద్దరికీ సాగు భూముల విషయంలో గొడవలు నడుస్తున్నాయి. ఈ విషయంలో కోర్టులో కేసు నడుస్తోంది. ఇదిలా ఉండగా విఠల్‌రెడ్డి తన 8 ఎకరాల భూమిని పెద్దనాన్న కొడుకైన చిన్నారెడ్డికి కౌలుకు ఇచ్చాడు. అందులో 14 గుంటల భూమి విషయంలో తరచూ సత్యంరెడ్డికి, చిన్నారెడ్డికి గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 19న గ్రామంలోని బెల్టుషాపు వద్ద చిన్నారెడ్డి, అతడి వద్ద పని చేసే గంగాధర్ మద్యం సేవిస్తున్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన సత్యంరెడ్డితో ఇద్దరూ గొడవకు దిగారు. గొడవలో గంగాధర్ బీరు బాటిల్‌తో సత్యంరెడ్డి తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం అర్ధ రాత్రి మృతి చెందాడు. సత్యంరెడ్డి కొడుకు ప్రవీణ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన గంగాధర్, అందుకు కారణమైన చిన్నారెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

శుక్రవారం ఉదయం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చిన కుటుంబీకులు, బంధువులు సత్యంరెడ్డి మృతికి విఠల్‌రెడ్డియే కారణమని ఆరోపిస్తూ అతడి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన చేపట్టారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ ఏసీపీ రాజశేఖర్ ఆధ్వర్యంలో రూరల్ సీఐ వెంకటరమణ, ఎస్సై మహేశ్‌కుమార్, నలుగురు ఎస్సైలు, సిబ్బందితో గ్రామానికి చేరుకున్నారు. ఆందోళన చేస్తున్న వారిని సముదాయించి నిందితులపై కఠినచర్యలు తీసుకుంటామని ఏసీపీ హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అంత్యక్రియలు శనివారం నిర్వహించనుండడంతో గ్రామంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పోలీసులు



విఠల్‌రెడ్డి ఇంటి ఎదుట ఉంచిన మృతదేహం